క్లుప్తంగా

తుంగతుర్తి డీఎస్పీ అభ్యర్థిగా బాలస్వామి



తుంగతుర్తి : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) తుంగతుర్తి నియోజకవర్గ అభ్యర్థిగా శాలి గౌరారం మండలంలోని మాదారం గ్రామానికి చెందిన దాసరి బాలస్వామిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా దాసరి బాలస్వామి మాట్లాడారు. నియోజకవర్గంలో 90శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు ఉన్నారని, వారందరి సమస్యల పరిష్కారం కోసం ముందుకు వెళ్తానని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని తెలిపారు. ఆయనతో పాటు డీఎస్పీ నియోజకవర్గ నాయకులు విజయరామరాజు, నరేష్, రాము, శ్రీకాంత్, వినీత్, అమర్‌నాథ్, మహేష్, భాస్కర్, సందీప్, రమేష్, శివ, మదన్ ఉన్నారు.

మద్యం పట్టివేత



పట్టుబడ్డ మద్యాన్ని చూపుతున్న సిబ్బంది

తుంగతుర్తి : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తుంగతుర్తి ఎక్సైజ్ సీఐ బాలాజీనాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగారం మండలంలోని పసునూర్, తుంగతుర్తి మండలంలోని వెంపటి, నూతనకల్ మండలంలోని కొత్తతండా, భాగ్యతండా, దిర్శపల్లితండా, బిక్కుమల్ల గ్రామాల్లోని బెల్ట్ షాపులు, సారా బట్టీలపై దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో 5 లీటర్ల సారాయి, 50 కేజీల బెల్లం, 500లీటర్ల బెల్లం పానకంతో పాటు, రూ.13వేల విలువగల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఇద్దరు వ్యక్తులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు మూర్తి, గణేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం

అర్వపల్లి : పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించడమే ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) లక్ష్యమని ఆ పార్టీ తుంగతుర్తి అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి బాలస్వామి (బాలు) అన్నారు. శుక్రవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. 90శాతం జనాభా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల తరఫున ధర్మ సమాజ్ పార్టీ పోటీలో ఉంటుందని తెలిపారు. పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు అనే నినాదంతో డీఎస్పీ ముందుకెళ్తుందని చెప్పారు. ఈ సమావేశంలో నియోజకవర్గ నాయకులు విజయరామరాజు, నరేష్, రాము, శ్రీకాంత్, వినిత్, అమర్‌నాథ్, మహేష్, సందీప్, భాస్కర్, రమేష్, శివ, మదన్ పాల్గొన్నారు.

కిషోర్ గెలుపొందాలని దర్గాలో ప్రార్థనలు

అర్వపల్లి : తుంగతుర్తి ఎమ్మెల్యేగా కిషోర్‌కుమార్ హ్యాట్రిక్ విజయం సాధించాలని కోరుతూ శుక్రవారం అర్వపల్లి శివారులోని హజ్రత్‌ఖాజానసీరుద్దీన్ బాబా దర్గాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్, కుంభం నాగరాజు, పున్న హరిప్రసాద్, కోటమర్తి మల్లయ్య, పెద్ది శ్రీను, బి.వెంకన్న, లొడంగి నాగరాజు, కుంభం నాగరాజు, యాదయ్య, సురేష్, రాజు, సందీప్, మహేష్, శేఖర్, సమ్మయ్య, శ్రీకాంత్, నరేష్, రాజశేఖర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం

మునగాల : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు ప్రతినెలా రూ.2500 నగదుతో పాటు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. మండలంలోని వెంకట్రాంపురం గ్రామపంచాయతీ ఆవాస గ్రామమైన ఎస్ఎన్‌పేటలో శుక్రవారం ఆమె కాంగ్రెస్ గ్యారంటీ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడువాయి తండాకు చెందిన 30 కుటుంబాలు, వెంకట్రాంపురం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు, ఎస్ఎన్‌పేటకు చెందిన 15 కుటుంబాలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో భుక్యా సంతోష్, భూక్యా పంతులు, భూక్యా భిక్షం, భూక్యా జగన్, అఖిల్, భానోతు సక్రు, భూక్యా వెంకన్న, అలిబీ, భూక్యా జగన్, బెల్లంపల్లి రామారావు, మందపల్లి శ్రీను తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, మండల అధికార ప్రతినిధి వేనేపల్లి వీరబాబు, నాయకులు ఎలక నరేందర్‌రెడ్డి, నల్లపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పద్మావతి

అరకొర బస్సులతో అవస్థలు

- పాఠశాలల సమయానికి సరిపడా బస్సులు లేక విద్యార్థుల ఇబ్బందులు
- బస్‌పాస్‌లు ఉన్నా బస్సుల్లో స్థలం లేక ఆటోలలో ప్రమాదకరంగా ప్రయాణం



పసునూర్‌లో బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

నాగారం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదివే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరకొర బస్సుల్లోనే విద్యార్థులు సర్కస్ ఫీట్లు చేస్తూ ప్రయాణం సాగిస్తున్నారు. విద్యార్థులకు బస్‌పాస్‌లు జారీ చేసిన అధికారులు వారి సంఖ్య, సమయానుకూలంగా బస్సులు నడపడం లేదు. దీంతో విద్యార్థులు బస్సుల కోసం అగచాట్లు పడుతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 600పైగా విద్యార్థులు చదుతువున్నారు. తుంగతుర్తి, పసునూర్, పస్తాల, గుమ్మడవెల్లి, వెంపటి, రెడ్డిగూడెం, వెలుగుపల్లి, అన్నారం, కొత్తగూడెం తదితర గ్రామాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో విద్యను అభ్యసించడానికి వస్తున్నారు. విద్యార్థులు బస్‌పాస్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారు. ఈ రూట్‌లో కేవలం రెండు బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఉప్పల్, సికింద్రాబాద్ డిపో బస్సు నడుస్తున్నాయి. ఈ రెండు బస్సుల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికులు ఎక్కువగా ఉంటారు. దీంతో విద్యార్థులను బస్సుల్లో ఎక్కించుకోవడానికి ఆర్టీసీ సిబ్బంది సైతం విముఖత చూపుతున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు బస్సు వద్ద తోపులాడుకుంటూ కిక్కిరిసి ప్రయాణం చేస్తున్నారు. బస్సులో స్థలం దొరకని విద్యార్థులు ఆటోలలో పాఠశాలకు వెళ్తున్నారు. ఒక్కొక్క బస్సులో సామర్థ్యానికి మించి రెండు, నుంచి మూడు రెట్లు అధికంగా విద్యార్థులు బస్సు ఎక్కి కాలుపెట్ట స్థలం లేని విధంగా ప్రమాదరకరంగా ప్రయాణిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆటోలలో ప్రయాణించే విద్యార్థులు ప్రమాదకర స్థితిలో ఆటోలలో పూర్తిగా కిక్కిరిసి, వెనుకాల నిలబడి ప్రయాణం చేస్తున్నారు. నాగారం మండలంలో బస్‌పాస్‌లతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు పాస్‌లు ఉన్నా బస్సులలో స్థలం దొరకక ఆటోలలో ప్రయాణం చేస్తూ ఆర్థికంగా కూడా నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రూట్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అదనంగా బస్సులు నడపాలి



మేము పాఠశాలకు వెళ్లే సమయంలో ఉదయం రెండు బస్సులు మాత్రమే వస్తాయి. దీంతో చాలా విద్యార్థులు బస్సు వద్ద తోపులాడుకుంటూ బస్సు ఎక్కాల్సి వస్తుంది. బస్సులో చోటు దొరకని విద్యార్థులు ఆటోలలో చార్జీలు వెచ్చించి పాఠశాలకు రావాల్సి వస్తుంది.

– ఎస్‌కే. సబీనా, మోడల్‌స్కూల్ విద్యార్థి

ఎన్నికల్లో విపక్షాలకు డిపాజిట్లు గల్లంతే



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ లింగయ్యయాదవ్

పెన్‌పహాడ్ : మంత్రి జగదీష్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి సూర్యాపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పెన్‌పహాడ్ మండలం నుంచి కాంగ్రెస్, బీజేపీలకు చెందిన సుమారు 100మంది బీఆర్ఎస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ఎన్నికల్లో విపక్షాలకు డిపాజిట్లు కూడా దక్కవన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, తూముల ఇంద్రసేనారావు, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, నెమ్మాది కృష్ణ, రఫి, వినోద్, గోపి పాల్గొన్నారు.

భానుపురి : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధిస్తారని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు సోమగాని లక్ష్మణ్ నాయుడు మంత్రి జగదీష్ రెడ్డి గెలవాలని 11 రోజుల పాటు అమ్మవారి మాల ధరించి ఇరుముడి ఎత్తుకొని విజయవాడ దుర్గమ్మ చెంతకు పాదయాత్రగా తరలివెళ్తుండగా ఆ పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సోమగాని వేణుగౌడ్, దేవరకొండ జనార్దన్, సోమగాని శైలజ, సాంబశివ, విజయలక్ష్మి, ప్రకాష్, లింగస్వామి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ స్నేహలత

తిరుమలగిరి : గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యేలా చూడాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. పచ్చదనం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించేలా చూడాలని కోరారు. గుండెపురి ఎంపీటీసీ జమ్మిలాల్ మాట్లాడుతూ చౌళ్లతండాలో నీటి సమస్య తలెత్తుతుందని, సిద్ధిసముద్రం తండాలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని, వీటిని సరి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దూపటి అంజలి, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, ఎంపీడీఓ ఉమేష్‌చారి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభివృద్ధి బీఎస్పీతోనే సాధ్యం



పెన్‌పహాడ్ : కండువా కప్పి బీఎస్పీలోకి ఆహ్వానిస్తున్న వట్టె జానయ్య యాదవ్

చివ్వెంల : బడుగు, బలహీనవర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే బీఎస్పీతోనే సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టె జానయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వాల్యతండా, మంగళితండా, బద్యాతండా, బి.చందుపట్ల గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దం అశోక్ రెడ్డి, బోడపట్ల శ్రీను, లింగానాయక్, గడ్డం సైదులు, చింతకాయల జానయ్య, సుంకరబోయిన రాజు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : బీఎస్పీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సూర్యాపేట బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టె జానయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం సింగారెడ్డిపాలెంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు బీఎస్పీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఏనుగు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గునగంటి జనార్దన్, వెంకన్న, సైదులు, వెంకన్న, గుర్వయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకాపరులకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న కడెం లింగయ్య

తిరుమలగిరి : గొర్రెల కాపరులకు నెలకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య కోరారు. శుక్రవారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో గొల్ల, కురుమల సమస్యలను ప్రతిపాదించాలని అన్నారు. దళితబంధు మాదిరిగానే గొల్ల, కురుమల బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గొల్ల, కురుమలు డీడీలు తీసి ఎనిమిది నెలలు కావస్తున్నా ప్రభుత్వం రెండవ విడత గొర్రెలు పంపిణీ చేయలేదని విమర్శించారు. ఆయన వెంట కడారి లింగయ్య, రాములు, అంజయ్య, మల్లయ్య, లింగయ్య, వినయ్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం



బహుమతులను ప్రదానం చేస్తున్న వెంకటేష్

మద్దిరాల : యువత క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని తెలంగాణ మాదిగ పోరాట సమితి రాష్ట్ర నాయకుడు, దళిత రత్న అవార్డు గ్రహీత బర్పటి వెంకటేష్ అన్నారు. దసరా సందర్భంగా కుక్కడంలో క్రీడా పోటీలను ఏర్పాటు చేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి శుక్రవారం బహుమతులను ప్రదానం చేశారు. గ్రామంలో క్రీడా పోటీలు నిర్వహించిన వెంకటేష్‌కు స్నేహయూత్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుధాల సుధాకర్, రాంపాక రవి, బర్పటి మహేష్, లింగయ్య, క్రాంతి, అంజయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్లాలుగా రహదారులు!



వెలుగుపల్లి వద్ద హైవేపై ఆరబోసిన ధాన్యం

అర్వపల్లి : ధాన్యం రాశులతో హైవే రోడ్లు అప్పుడే నిండిపోతున్నాయి. నకిరేకల్–తానంచర్ల, సూర్యాపేట–జనగామ రెండు జాతీయ రహదారులపై రైతులు ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ఆరిన ధాన్యాన్ని రోడ్లపై రాసులు పోసి పెడుతున్నారు. సూర్యాపేట మండలం యర్కారం, రాజానాయక్‌తండా, జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం, అడివెంల, వేల్పుచర్ల, పర్సాయపల్లి, సీతారాంపురం, బొల్లంపల్లి, జాజిరెడ్డిగూడెం, శాలిగౌరారం మండలం వంగమర్తి తదతర ప్రాంతాల్లో 365, 365బీ హైవేలపై ధాన్యం రాసులు పోసి ఉంచారు. మరికొంత మంది రైతులు ధాన్యం పోయడానికి హైవేపై స్థలాలను అడ్వాన్స్‌గా సిద్ధం చేసి ఉంచారు. అధికారులు ధాన్యం కొనుగోళ్లను ముమ్మరం చేసి హైవేపై పోసిన ధాన్యాన్ని ముందుగా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

సీఎం కేసీఆర్ సభ పోస్టర్ ఆవిష్కరణ



తుంగతుర్తి : వెలుగుపల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నాగారంలో..

తుంగతుర్తి : ఈ నెల 29న తిరుమలగిరిలో జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. శుక్రవారం వెలుగుపల్లిలో బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే రావులపల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య ఆధ్వర్యంలో, గానుగుబండ గ్రామంలో గుండగాని రాములు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడిచర్ల సత్యనారాయణ, మల్లేపాక రాములు, పరమేష్, మల్లయ్య, శ్రీరంగం, గుడిపాటి వీరయ్య, దుర్గయ్య, శ్రీహరి, శ్రీనివాస్, కుశలవరెడ్డి, నాగమ్మ, సూర్యప్రకాశ్, సోమయ్య పాల్గొన్నారు.

సీఎం సభను జయప్రదం చేయాలి

అర్వపల్లి : తిరుమలగిరిలో ఈ నెల 29న జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ కోరారు. సభ విజయవంతానికై శుక్రవారం స్థానికంగా నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో గత 50ఏళ్లలో జరగని అభివృద్ధి ఎమ్మెల్యే కిషోర్ ఆధ్వర్యంలో 10ఏళ్లలో జరిగిందని చెప్పారు. అర్వపల్లిలో కూడా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, కాపా వెంకటేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్, కడారి నరేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : మాట్లాడుతున్న జెడ్పీటీసీ వీరప్రసాద్

నాగారం : తిరుమలగిరిలో ఈ నెల 29న జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కడియం పరమేశ్వర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కచారు. సభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిప్పలపల్లి మల్లేష్, సోమ నర్సయ్య, మౌనిక, పాల్వాయి మల్లయ్య, క్రాంతికుమార్, లక్ష్మణ్, వెంకటేష్, చరణ్, వీరేష్, బన్ని, శివ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సీఎం ప్రకటనపై హర్షం

అర్వపల్లి : రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించడంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం రామచంద్రయ్య శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాలు, దళితులకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



సూర్యాపేట రూరల్ : ఎండ్లపల్లిలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ భిక్షం



చివ్వెంలలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేట : బీఆర్ఎస్ మేనిఫెస్టో సబ్బండ వర్గాలకు భరోసా అని మంత్రి జగదీష్‌రెడ్డి సతీమణి సునీత అన్నారు. సూర్యాపేటలో కొనసాగుతున్న ప్రచారంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రెండవ రోజు 33వ వార్డులో ప్రచారం నిర్వహించారు. దేశంలో పేదలకు సన్నబియ్యం, రూ.400లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. జగదీష్‌రెడ్డిని గెలిపించి సూర్యాపేట అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మంత్రి జగదీష్‌రెడ్డి పాలనలో ప్రశాంత వాతావరణంలో పేట ప్రజలు

సూర్యాపేట రూరల్ : 10 ఏళ్ల నుంచి మంత్రి జగదీష్‌రెడ్డి పాలనలో సూర్యాపేట నియోజకవర్గంలో ఎలాంటి ఘర్షణలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పేట ప్రజలు జీవిస్తున్నారని జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎండ్లపల్లి గ్రామంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో జగదీష్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కుంట్ల సుదర్శన్‌రెడ్డి, ఉయ్యాల రవి, కుంట్ల భీష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : మంత్రి జగదీష్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జూలకంటి సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, పబ్బు సైదులు, రావిచెట్టు సత్యం తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన బీఆర్ఎస్



తిరుమలగిరి : మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యాదగిరిరావు



మద్దిరాలలో మాట్లాడుతున్న కోట గోపి

తిరుమలగిరి : బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. శుక్రవారం ఆయన తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా పని చేసిన కేసీఆర్ ప్రకటించిన హామీలను నేటికీ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. గత వాగ్దానాలను అమలు చేయకుండా మళ్లీ కొత్త హామీలు ఇస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. దళిత గిరిజనులకు 3 ఎకరాల భూమి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన, అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండల కన్వీనర్ జి.ఉప్పలయ్య, కడెం లింగయ్య, రాజ్‌కుమార్, కడారి లింగయ్య పాల్గొన్నారు.

అధికార పార్టీ ఆగడాలను ఎండగడతాం

మద్దిరాల : తుంగతుర్తి నియోజకవర్గంలో అధికార పార్టీ ఆగడాలను ఎండగడతామని, బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌ను ఓడిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోరెంట్లలో దళిత బంధు, గృహలక్ష్మి ఎంత మందికి ఇచ్చారని సీపీఎం మాజీ ఎంపీటీసీ పాల్వాయి కవిత ప్రశ్నిస్తే బీఆర్ఎస్ అరాచక శక్తులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కందాల శంకర్‌రెడ్డి, గోరెంట్ల మాజీ ఎంపీటీసీ పాల్వాయి కవిత, పోలోజు విక్రమ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

29న మలిదశ ఉద్యమకారుల సమ్మేళనం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో 29వ తేదీన నిర్వహించే మలిదశ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మలిదశ ఉద్యమకారులు దొడ్డ నర్సింహారావు, చిలకరాజు అజయ్, నగేష్ రాథోడ్ కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన మలిదశ ఉద్యమకారుల ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారులు మెండె లక్ష్మీనర్సు, పానుగంటి వెంకన్న, శీలం వీరయ్య, దుండిగళ్ల నారాయణ, జూలకంటి రామ నరసమ్మ, సత్యనారాయణరెడ్డి, జానీ బాష, లతీఫ్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చింతలపాలెంలో..

తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మలిదశ ఉద్యమకారులు కోరారు. శుక్రవారం చింతలపాలెంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఐక్యవేదిక సభ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. మలిదశ ఉద్యమకారులు వేములూరి రంగాచారి, నగేష్ రాథోడ్, దొడ్డ నర్సింహరావు, చిలక రాజు అజయ్, ఉసిరికాయల వెంకటేశ్వర్లు, గులాం హుస్సేన్, శ్రీకాంత్, శ్రీనివాస్, మతిన్, సోమయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

గరిడేపల్లి : గడ్డిపల్లిలోని కుతుబ్షాపురం రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే సైదిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా గడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త పొదిల భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పూసల నవీన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా అతడిని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట సహకార సంఘం చైర్మన్ గంటా సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మేకల స్రవంతి శోభన్‌బాబు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులకు నిరసన



కోదాడలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కోదాడఅర్బన్ : పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు చేయడాన్ని ఖండిస్తూ కోదాడలోని పెద్ద మసీద్ ఎదుట శుక్రవారం ముస్లింలు, ప్రజా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మైనార్టీ నాయకుడు ఎస్‌కే నయీం మాట్లాడుతూ అమెరికా అండదండలతో గత 20 రోజులుగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. ఇజ్రాయిల్ తక్షణమే దాడులను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, ముస్లిం మత పెద్దలు మౌలానా, హతహర్, మహిముద్ జానీ, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహారావు, రైతు కూలీ సంఘం నాయకుడు సత్యనారాయణరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఉద్యోగిపై విచారణ

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణపై శుక్రవారం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వెంకటరమణ, జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ సాహితిలు విచారణ చేపట్టారు. సత్యనారాయణ విధులకు హాజరు కాకుండా రిజిస్టర్‌లో సంతకాలు చేసి 11నెలల వేతనం తీసుకున్నాడని అక్టోబర్ 16న శ్రీధర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టామని వారు తెలిపారు. ఈ మేరకు విధులకు హాజరుకాకుండానే వేతనం తీసుకున్నట్లు విచారణలో గుర్తించినట్లు తెలిపారు. డీడీఓగా పనిచేసిన, మండల వైద్యాధికారి స్రవంతి, సీనియర్ అసిస్టెంట్ రోహిణి, కాంట్రాక్ట్ డాక్టర్ మణిదీప్‌ల వద్ద వివరణ కోరామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. విచారణ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ కోటాచలం పరిశీలించారు.

సస్పెండ్ చేయాలి

విధులకు హాజరుకాకుండా జీతం డ్రా చేసుకున్న ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణను సస్పెండ్ చేయాలని సీపీఎం మండల అధ్యక్షుడు రణపంగ కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. విధులకు హాజరు కాకుండానే జీతం డబ్బులు డ్రా చేసిన అధికారిపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేస్తామన్నారు.

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



కేఎల్ఎన్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న గీత కార్మికులు, నాయకులు

హుజూర్‌నగర్ : గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. హుజూర్‌నగర్‌లో గీత కార్మికులకు ఇటీవల 55 కొత్త లైసెన్సులు మంజూరు చేయించిన సందర్భంగా శుక్రవారం పట్టణ గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ అధ్యక్షుడు వల్లపుదాస్ కృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ యరగాని నాగన్న, పెద్దగౌడ్‌లు ఉపేందర్, రామ్మూర్తి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, పరశురాములు, పాండు, సాయన్న, శ్రీను, సైదులు పాల్గొన్నారు

నీటిని విడుదల చేయాలి

మునగాల : సాగర్ ఎడమకాలువ కింద ప్రస్తుత సీజన్‌లో సాగుచేసిన పైర్లకు సాగునీటిని విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పంటలు చేతికి వచ్చే సమయంలో సాగునీరు అందక ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. దీంతో మండలంలోని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన సాగునీటిని విడుదల చేయాలని, ఆయకట్టు కింద ఉన్న రైతులను ఆదుకోవాలని కోరారు.